# దుఃఖం

**-శ్రీమతి న్యాయపతి కమలారాంజీ**

నేను చాలా అలసిపోయాను. అందుకని పడుకోగానే నిద్ర ముంచుకొచ్చేసింది. మంచి నిద్ర. చాలా సుఖమైన నిద్ర. ఎప్పుడూ ఇంత హాయిగా, సుఖంగా నిద్రపోలేదు నేను. ఎప్పుడూ ఏదో ఒకటి వంటికి. నిద్ర పట్టని నాకు ఎప్పుడూ ఏవో ఒక భయంకరమైన ఆలోచనలే!

అన్నీ ఇచ్చిన ఆ దేవుడు నాకు ఆరోగ్యాన్ని మాత్రం ఇవ్వలేదు.

ఒకరోజు లేస్తేనే నడుం పట్టేసింది. నాకు తరచూ అలా నడుం పట్టేస్తోందీమధ్య. గంటా రెండు గంటలయ్యాక కొంచెం సర్దుకుంటుంది. ఆ రోజు అలాగే సర్దుకుపోతుం దని అనుకున్నాను. కానీ ఎంతకీ మంచం మీంచి లేవలేక పోయాను. ఎన్ని బ్రూఫిన్లు వేసుకున్నా తగ్గలేదు. డాక్టర్‌కి చూపిస్తే ఎక్స్‌రే తీయాలన్నారు. ఎక్స్‌రే తీసేక రెండు వెన్ను పూసలేవో జారాయి, ట్రాక్షన్ పెట్టాలి అన్నారు డాక్టర్. కానీ షుగర్ పేషెంట్ కదా. కాస్త జాగ్రత్తగా ఉండాలి అన్నారు.

నేను చాలా సెన్సిటివ్. ప్రతి చిన్న విషయాన్ని కూడా ఎక్కువగా తల్చుకుని బాధపడిపోతూ ఉంటాను. డాక్టర్ అలా చెప్పగానే నాకు ఏడుపొచ్చింది. కానీ తప్పదుకదా!

మరొకసారి వంటింట్లో పని చేసుకుంటూ వుంటే కళ్లు తిరిగాయి. కళ్లు చీకట్లు కమ్మడం, తల తిరగడంతో ఎవరో వెనుక నుంచి తోసేసినట్టుగా హఠాత్తుగా దబ్బున క్రింద పడిపోవడంతో ఎడమచెయ్యి విరిగింది. మళ్లీ డాక్టర్...ఎక్స్‌రే. 'చెయ్యి ఫ్రాక్చర్ అయింది. ఆరువారాలు ప్లాస్టర్ వేయాలి' అన్నారు. మళ్లీ 'షుగర్ పేషెంట్‌కదా. జాగ్రత్తగా ఉండాలి.' పాతపాటే.

ఈ షుగర్ జబ్బు ఇంటికి మెయిన్‌గేట్ లాంటిది. మెయిన్ గేట్ తెరిచి వుంటే అడ్డమైన వాళ్లూ లోపలికి వచ్చేసినట్టే షుగర్ జబ్బు వంట్లో వుంటే చాలు మిగతా జబ్బులన్నీ పిలవని పేరంటంలా చక్కగా వచ్చి చేరతాయి. హైబిపి వల్ల తల తిరిగింది. రెస్టు బాగా అవసరం అన్నారు. ఈ విధంగా ఆరువారాలు అవస్థపడ్డాను.

అప్పుడు ఉగాది పండగరోజులు. పిల్లలు తింటారని స్వీట్స్, హాట్స్ స్వయంగా కష్టపడి తయారుచేశాను. ఎక్కువసేపు స్టౌ దగ్గర వుండడంవల్ల ఆ వేడికో మరి దేనికోగానీ ఒక కన్ను ఎర్రగా అయిపోయి కురుపు సలిపినట్లుగా కంటిలోపల సలుపు, పోటు మొదలయ్యాయి. నేను చాలా భయపడిపోయాను. అప్పుడప్పుడు అలా అవుతున్నా నేను అంతగా పట్టించుకోలేదు. హాస్పిటల్ ఒక నరకం నా దృష్టిలో. కానీ ఆ రోజు చాలా తీవ్రంగా ఉంది కంటినొప్పి. చేసేదిలేక కళ్ల డాక్టర్ దగ్గరకు వెళ్లాను. ఆయన చాలాసేపు కన్నుని పరీక్షించిన తరువాత తిట్టినంత పని చేసేరు.

''మీరు చాలా నిర్లక్ష్యం చేశారు ఇప్పటికే. మీ కళ్లకి గ్లూకోమా అనే జబ్బు వచ్చింది. అది మందులతో పోదు. ఆపరేషన్ చేయించుకోవాలి'' అన్నారు. మళ్లీ దుఃఖం తన్నుకొచ్చింది.

నా వంట్లో ఎన్ని జబ్బులున్నాయో నాకే తెలీదు.

అనురాగాన్ని, ఆప్యాయతనీ అందించే భర్త, నీకు నేనున్నానని ధైర్యం చెప్పే భర్త, నా కష్టాన్ని తన కష్టంగా భావిస్తూ ప్రతిక్షణం నాకు తోడుగా నిలిచే భర్త!

అలాంటి భర్తని పొందిన నా అదృష్టానికి మురిసిపోతూ, నా జబ్బులన్నీ తాత్కాలికంగా మర్చిపోయి రోజులు సరదాగానే గడిపేస్తున్నాను.

కానీ...కానీ నేను అద్దం చూసుకున్నప్పుడల్లా నాలో ఏదో వెలితి, ఏదో బాధ!

నా రూపం నన్నే వెక్కిరిస్తున్నట్లుగా వుంటుంది! మెడమీద ముడతలు, కళ్లకింద నలుపు, నెరిసిన జుట్టు, బిగువు సడలిన శరీరం, జబ్బులతో బాగా శుష్కించిపోయి జీవకళ లేని పీక్కుపోయిన ముఖం...ఇదంతా చూస్తుంటే ఏదో భయంకరమైన ఆలోచన మనసులో మెదిలేది.

> **నేను లేచేసరికి ఇల్లంతా హడావుడిగా ఉంది. ఎవరి పన్ల హడావుడిలో వాళ్లున్నారు. అందరూ అటూ ఇటూ హడావుడిగా తిరుగుతున్నారు. ఎవరెవరో వచ్చేస్తున్నారు మా ఇంటికి. కానీ ఎవరూ నన్ను పట్టించుకోవడంలేదు.**

''నువ్వు ఈ భూమ్మీదకు వచ్చిన పని అయిపోయింది. ఇహ నువ్వు ఇక్కడ చెయ్యవల్సిన రాచకార్యాలంటూ ఏమీ లేవు. నువ్వింకా ఇక్కడే వుంటే నీ భర్తచేత, పిల్లలచేత సేవలు చేయించుకుంటూ వాళ్లని కష్టపెట్టినదానివి అవుతావు. కానీ నీవల్ల ఇంక ఎవ్వరికీ ఎటువంటి ఉపయోగం లేదు. నువ్వు ఎవరికీ పనికిరావు. హాయిగా నా లోకానికి వచ్చేయ్'' అని ఆ దేవుడు ఫోన్‌లో మాట్లాడుతున్నట్టుగా విచిత్రమైన ఊహ కలిగేది.

ఇంతేనా! జీవితం అంటే ఇంతేనా!

''నాది...నాది...అనుకున్నది ఏదీ నాది కాదు'' ఎవరన్నారోగానీ ఎంత నిజం!

''తొలి శ్వాసకీ చివరి శ్వాసకీ మధ్యనున్నదే జీవితం'' అన్నది ఎంత చేదు నిజం.

అద్దాన్ని చూస్తే చాలు మనసుని కోస్తూ గుండెని చీలుస్తూ లావాలా దుఃఖం పైకి తన్నుకొస్తుంది. అద్దాన్ని పగలగొట్టాలనిపిస్తుంది. కానీ పాపం ఇందులో అద్దం తప్పేముంది?

అద్దం పరిస్థితి వివరిస్తుంది. కానీ పరిష్కారాన్ని చూపదుకదా! ఆ సంగతి తెలిసినా అదేదో నాకర్థంకాని కసి బయలుదేరుతుంది. ఆయన ఎప్పుడు నాకు ధైర్యాన్ని నూరిపోసేవారు.

''మనం వర్తమానంలోనే బ్రతుకుదాం. గతం మనకి వద్దు. భవిష్యత్తు మీద ఆశ పెట్టుకోవద్దు. మనకింక భవిష్యత్తు ఏమిటి నీ పిచ్చిగాని. మనం ఇప్పుడు ఆరాటపడాల్సింది పిల్లల భవిష్యత్తు కోసం. మన పిల్లలు ప్రయోజకులయ్యారు. అది చాలు మనకి. వాళ్లని చూసి సంతోషించు. నువ్వు నీ జబ్బుల్ని తల్చుకుని ఏడుస్తూ కూర్చుంటే ఆ జబ్బులు మరింత ఎక్కువ అవుతాయిగానీ తగ్గవు. పుట్టిన ప్రతి వాడికీ చావు తప్పదు. నిజం చెప్పాలంటే దేవుడు మనకి ఏ లోటూ చేయలేదు. ఎంతో మందికంటే మనం ఎంతో బాగున్నాం. అలా అనుకుని తృప్తిపడు. మనిషి ఎప్పుడూ సంతోషంగా బ్రతకాలంటే మనిషికి కావాల్సింది ముఖ్యమైన ఔషధం తృప్తి.''

అయినా మరణాన్ని తల్చుకుంటే నాకు దుఃఖం తన్నుకొస్తోంది అప్రయత్నంగా. ఆ రోజు నాకు చాలా నీరసంగా వుంది. లేవలేనంత నీరసం. మాట్లాడలేనంత నీరసం. ఏ పని చేయలేక అలా పడుకున్నాను. ఆయన డాక్టర్‌ని తీసుకొచ్చారు. డాక్టర్ ఏవేవో పరీక్షలు చేస్తున్నాడు. వాళ్లిద్దరూ ఏదో మాట్లాడుకుంటున్నారు. ఇద్దరి ముఖాల్లోనూ ఏదో ఆందోళన కనిపిస్తున్నది. ఎందుకో తెలీదు. నాకు సరిగ్గా వినిపించడంలేదు. ఏదో మగతగా ఉంది. మత్తుగావుంది. కళ్లు మూసుకుపోతున్నాయి. శరీరం తేలిగ్గా అయిపోతోంది. ఆలోచనలు కూడా అదేమిటో విచిత్రంగా తెరుచుకున్న పంజరంలోంచి ఎగిరిపోతున్న పక్షుల్లా దూరంగా పారిపోతున్నాయి. ఆలోచనలతో మనసు పాడవడం అన్న సమస్యేలేదు. అసలు ఆలోచనలే లేవు. నా కళ్లు పూర్తిగా మూసుకుపోయాయి. ఎన్నడూ లేనంత సుఖమైన నిద్ర. హాయిగా నిద్ర పట్టేసింది. ఈమధ్యకాలంలో ఎప్పుడూ

అంత మంచి నిద్ర పట్టలేదు నాకు.


నేను లేచేసరికి ఇల్లంతా హడావుడిగా ఉంది. ఎవరి పన్ల హడావుడిలో వాళ్లున్నారు. అందరూ అటూ ఇటూ హడావుడిగా తిరుగుతున్నారు. ఎవరెవరో వచ్చేస్తున్నారు మా ఇంటికి. కానీ ఎవరూ నన్ను పట్టించుకోవడం లేదు.

అదేమిటి వసంత ఎప్పుడొచ్చింది? నాకు తెలీనే తెలియదు. వసంత మా ఆడబడుచు. తునిలో వుంటున్నది. దగ్గరే కాబట్టి తరచూ వస్తూ వుంటుంది. కానీ విచిత్రం ఏమిటంటే తనెప్పుడొచ్చిందో తెలీనంత గాఢమైన నిద్ర పట్టేసింది నాకు. ఎందుకు లేపడం అని ఊరుకుని వుంటుందా? నా తోడికోడళ్లు, మరుదులు... ఇంకా ఎవరెవరో వచ్చారు. అందరూ నా మంచం దగ్గరకు వచ్చి నన్ను చూసి వెళ్లిపోతున్నారు. కానీ నన్ను ఎవరూ పలకరించడంలేదు. నేను పడుకున్నాను కదా. ఎందుకు డిస్టర్బ్ చేయడం అనుకుని వుంటారు.

మా అమ్మాయి మాధవి మాత్రం ఎందుకో కళ్లు తుడుచుకుంటున్నది. దాన్ని ఎవరన్నా ఏదన్నా అని వుంటారు. పాపం దాని మనసు చాలా సున్నితం. అందుకే ఏడుస్తున్నది కాబోలు. ఆయన అప్పుడప్పుడు వచ్చి నన్ను చూసి వెళ్లిపోతున్నారు. నన్ను ఎవరూ లేపరేమిటి? నేను అందర్నీ చూస్తున్నాను. కానీ ఎవరూ నన్ను చూడ్డం లేదు. నాతో మాట్లాడడంలేదు. మా చిన్న తోడికోడలు నీలిమ వచ్చి ఆయన్ని ఏదో ఒకటి అడిగి మళ్లీ లోపలికి వెళ్లిపోతోంది. నాకు వళ్లు మండిపోయింది. ఇంట్లో పెద్ద దాన్ని నేనుండగా ఆయన్ను అడుగుతుందేమిటి? ఇంట్లో ఏవి ఎక్కడ ఉన్నాయో నాకు తెల్సినంతగా వాళ్లెవరికీ తెలీదు. నేనంటే ఎంత నిర్లక్ష్యం తనకి. నాకు చాలా ఉక్రోషం వచ్చింది. ఏదో తెలీని బాధ. మనసు అట్టడుగు పొరల్లోంచి తన్నుకొస్తున్న దుఃఖం.

శక్తినంతా కూడదీసుకుని లేచాను. ఆయన దగ్గరకెళ్లాను. ఆయన అదేమిటో సర్వస్వం కోల్పోయినవారిలా దిగులుగా మౌనంగా కూర్చున్నారు. ఆయన భుజం మీద చేయివేసి అడిగాను. ''ఏమిటండీ ఈ అన్యాయం? మీరందరూ నాతో మాట్లాడ్డం లేదేమిటి? నేనేం పాపం చేశాను?'' అని. ఆయనసలు నా మాటే పట్టించుకోలేదు. జీవితంలో ఏదో పోగొట్టుకున్న వారిలా దిగులుగా శూన్యంలోకి చూస్తున్నారు. ఆయనకి చెప్తే ఎంతో గోడకి చెప్పినా అంతే అనుకున్నాను కోపంగా.

నా శరీరం తేలిగ్గా, దూదిపింజెకన్నా తేలిగ్గా ఉంది. గమ్మత్తుగా నా జబ్బులన్నీ మటుమాయం అయిపోయాయి. నాకిప్పుడు ఎంతో హాయిగా ఉంది. ఇల్లంతా తిరిగేస్తున్నాను సరదాగా. కానీ అదేమిటో ఎవరూ నన్ను చూడ్డంలేదు. నాతో మాట్లాడ్డంలేదు.



అప్పుడు...అప్పుడు వసంత మాటలు నా చెవుల్లో పడ్డాయి.

''వదిన అదృష్టవంతురాలు. హాయిగా సుమంగళిగా పోయింది. రత్నాల్లాంటి బిడ్డల్ని కంది. నిజం చెప్పాలంటే ఆమెకేలోటూ లేదు'' అంటోంది ఎవరితోనో.

ఎవరి గురించి? ఎవరు పోయారు? నాకేమీ అర్ధంకా లేదు. ఇంకా ముందుకు వెళ్లాను. మా అమ్మాయి వెక్కివెక్కి ఏడుస్తోంది. ఆయన దాన్ని దగ్గరకు తీసుకుని ఓదారుస్తున్నారు. ''ఊరుకో తల్లీ! నువ్వు ఎంత ఏడ్చినా అమ్మ తిరిగి రాదుకదా. ఊరుకో.'' నాకు చాలా భయం వేసింది. నా గురించి మాట్లాడుకుంటున్నారేమోనని ఎందుకో అనుమానం కలిగింది. నేను లేనా? ఉన్నానుకదా! అనుమానం వచ్చి చేతితో గిల్లుకుందామని చెయ్యి ఎత్తాను. ఆశ్చర్యం నా చెయ్యిలేదు. అయ్యో! అసలు నా శరీరం ఏది? లేదు... నేను ఏమయిపోయాను? ఏమిటిదంతా? ''నేను లేను.'' ఇది భరించలేని, భరింపరాని నిజం! నా పంచప్రాణాలు పంచభూతాల్లో ఎప్పుడో కల్సిపోయాయి. అయ్యో! నామీద నాకే జాలేసింది!

నా ఇల్లు...నా పిల్లలు...నావాళ్లు...నా శరీరం...అయ్యో! నా శరీరం... లేదు. లేదు. నాకు శరీరమేలేదు. అయ్యో! ఈ నిజాన్ని భరించలేకపోతున్నాను. నా వాళ్లని వదిలి వెళ్లలేకపోతున్నాను.

అనురాగ బంధాలను త్రెంచుకోలేని నా ఆత్మ ఇంకా ఆ ఇంట్లోనే అల్లల్లాడిపోతోంది అగమ్యగోచరంగా. ఒక్కసారిగా కుండపోతగా వర్షం కురిసినట్లుగా నా గుండె పగిలి అందులోంచి దుఃఖం తన్నుకొచ్చింది!

★